నేటి కందం- నేటికి అందం

శ్రీయుత కరీము నగరున
కాయుష్షును దెచ్చి మిగుల నత్యద్భుతమౌ
శ్రేయమ్ము నందజేసిన
ధీయుతులకు ప్రజలు నతులు తెలిపెదరు మొగిన్ !!

(కరీంనగర్ లో ఆయుష్ హాస్పిటల్ నిర్మించబడుతున్నది.కరీంనగర్ కు "ఆయుష్" హాస్పిటల్ ను మంజూరు చేయించిన వారికి ప్రజలు వందనాలు తెలియజేస్తున్నారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

జాతి మతం విద్వేషం
జరిగే పలు నేరాలు
విస్తరిస్తే బాధ్యులెవరు
విపక్షల ఘోరాలు
రాజకీయ అధికారం
రక్షణలో దాని జోరు
కంచే చేను మేస్తుంటే
కట్టడింకా బేజారు

చురక



-వేల్పుల నారాయణ
9440433475

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 11-1-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:128 పేజీలు:6 వెల: రూ.1/-


## కేవలం సిఎం,సిఎస్ మాత్రమే అధికారులను మాత్రమే బదిలీ చేస్తారు

**టిక్కెట్ల ధరల పెంపు సంబంధించి ఏ ఫైల్ తన వద్దకు రాలేదు**
**బెనిఫిట్ షోల కోసం తనను ఎవరూ సంప్రదించలేదు**
**కుటుంబాలను ఇబ్బంది పెట్టేలా రాతలు రాయొద్దని మంత్రి కోమటిరెడ్డి హితవు**



హైదరాబాద్ జనవరి 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కేవలం సిఎం,సిఎస్ మాత్రమే అధికారులను మాత్రమే బదిలీ చేస్తారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. కుటుంబాలను ఇబ్బంది పెట్టేలా రాతలు రాయొద్దని హితవు పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ...మహిళా ఐఎస్ఎస్ పై దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల తర్వాత నల్గొండకు నలుగురు కలెక్టర్ల మారారని, తన జిల్లాలోనే కాదు..మంత్రులు, ఎమ్మెల్యేలకు తెలియకుండానే బదిలీలు జరుగుతాయని తెలియజేశారు. మంత్రులపై ఇటీవల వస్తున్న ఆరోపణల్ని కోమటి రెడ్డి ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కలెక్టర్ల బదిలీలు, పదోన్నతులు సర్వసాధారణం అని.. అధికారుల మీద అభాండాలు వేయటం సరికాదని అన్నారు. రేటింగ్ లు, వ్యూస్ కోసం దుష్ప్రచారం సరికాదని, అధికారుల కుటుంబాల గౌరవం గురించి కూడా ఆలోచించాలని సూచించారు. సినిమా పరిశ్రమపై ఇంకా దృష్టి పెట్టలేదని, పుష్ప సినిమా తర్వాత బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు ఉండదని చెప్పానని అన్నారు. బెనిఫిట్ షోలు, టికెట్ల పెంపు కోసం తన వద్దకు రావొద్దని చెప్పానని, సినీ పరిశ్రమ గురించి పట్టించుకోవడం మానేశానని, టిక్కెట్ల ధరల పెంపు సంబంధించి ఏ ఫైల్ తన వద్దకు రాలేదని చెప్పారు. బెనిఫిట్ షోల కోసం తనను ఎవరూ సంప్రదించలేదని, సంధ్య థియేటర్ బాధిత కుటుంబానికి రూ. 25 లక్షలు అందించానని తెలియజేశారు. బాధిత బాలుడిని చదివిస్తానని చెప్పానని, చిత్ర పరిశ్రమ సమస్యల కంటే ప్రజల సంక్షేమం, అభివృద్ధి పనులే తనకు ప్రాధాన్యత ఇచ్చానని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

## సిద్దిపేట జిల్లాను తొలగిస్తామని ఎక్కడా చెప్పలేదు: మంత్రి పొన్నం

హుస్నాబాద్ జనవరి 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: సిద్దిపేట జిల్లాను తొలగిస్తామని ఎక్కడా చెప్పలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సిద్దిపేట జిల్లాను రద్దు చేస్తాంటే తాను ఊరుకోనని హరీష్ రావు హెచ్చరించిన సందర్భంగా పొన్నం కౌంటర్ ఇచ్చారు. కెసిఆర్ ప్రభుత్వంలో జిల్లాల విభజన శాస్త్రీయంగా జరగలేదని, హుస్నాబాద్ మండల ప్రజలు సిద్దిపేటలో ఉండాలను కోవడం లేదని, కరీంనగర్ జిల్లాలో కలపాలని కోరుతున్నారన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో ఇష్టానుసారంగా జిల్లాల విభజన చేశారని, ప్రజల నుంచి వినతులు కూడా పట్టించుకోలేదన్నారు. పలు జిల్లాల హద్దులు మారుతాయని జిల్లాల పేర్లు మారవని స్పష్టం చేశారు. ప్రజల బలమైన ఆకాంక్షల మేరకే జిల్లాల పునర్ వ్యవస్థీకరణ జరుగుతుందని పొన్నం స్పష్టం చేశారు. ఆందోళనతో రాజకీయ లబ్ది పొందే ప్రయత్నం చేయవద్దని హరీష్‌రావుకు పొన్నం చురకలంటించారు. సిద్దిపేట జిల్లా రద్దు చేస్తామంటే ఊరుకోమని, తనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోపం సిద్దిపేట జిల్లా చూపించడం సరికాదని బిఆర్ఎస్ ఎంఎల్ఏ హరీష్ రావు వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

## జనవరి 19 నుంచి దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం-2026 సమ్మిట్

**-క్యూర్, ప్యూర్, రేర్ ప్రణాళికలను ప్రపంచానికి పరిచయం చేస్తాం: రేవంత్**



హైదరాబాద్ జనవరి 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: స్పిరిట్ ఆఫ్ డైలాగ్"అనే థీమ్‌తో వరల్డ్ ఎకనామిక్ ఫోరం?2026 సమ్మిట్ జనవరి 19 నుంచి 23 వరకు దావోస్‌లో జరగనుందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే పెట్టుబడులను సాధించడమే ధ్యేయంగా దావోస్‌లో జరగనున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం (ప్రపంచ ఆర్థిక సదస్సు)?2026 సదస్సులో తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను రూపొందించారని అన్నారు. దానికి అనుగుణంగా రూపొందించిన క్యూర్, ప్యూర్, రేర్ ప్రణాళికలను ప్రపంచానికి పరిచయం చేయాలని రేవంత్ రెడ్డి అధికారులకు నిర్దేశించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో ముందుకు సాగుతోందని పునరుద్ఘాటించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గడిచిన రెండేళ్లలో దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా రాష్ట్రానికి లభించిన పెట్టుబడి హామీలు, ప్రతిపా దనల పురోగతితో పాటు.. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట-2025లో ఆకర్షించిన పెట్టుబడులు ఇప్పటి వరకు ఏ స్థాయిలో అమలయ్యాయనే అంశాలను సిఎం సమీక్షించారు. పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణకు ఇప్పటికే ఉన్న బలాలు, సామర్థ్యాలను మరింతగా వినియోగించుకొని, మూడంచెల ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసేలా రూపొందించిన క్యూర్, ప్యూర్ , రేర్ ప్రణాళికలను తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం దావోస్ వేదికగా ప్రపంచానికి వివరిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయండి: భట్టి విక్రమార్క





హైదరాబాద్, జనవరి 10:తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని.. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. ఇవాళ (శనివారం)న్యూఢిల్లీలోని అశోకా హోటల్లో ప్రి బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి.. ఈ మేరకు కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు.

బడ్జెట్ ముందస్తు సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడిన ముఖ్యమైన అంశాలు:

తెలంగాణ ప్రభుత్వం తరపున, నా తరపున.. రాష్ట్రాలతో బడ్జెట్ ముందస్తు సంప్రదింపులు జరుపుతున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

ఒక దేశం కేంద్ర-రాష్ట్రాల సమన్వయం ద్వారానే పురోగమిస్తుంది. కేంద్ర బడ్జెట్ తయారీలో రాష్ట్రాలను భాగస్వామ్యం చేయడం ముఖ్యమైన చొరవ. ఇది సహకార సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేస్తుంది. అభివృద్ధి చెందిన భారతదేశం (వికసిత్ భారత్) లక్ష్యాన్ని సాధించడంలో సహాయపడుతుందని నేను నమ్ముతున్నాను.

2047 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే భారత ప్రభుత్వ లక్ష్యాన్ని అభినందిస్తున్నాను.

ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5.1 శాతం.

మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మేము తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించాము. దీని ద్వారా తెలంగాణను ప్రస్తుతం ఉన్న 200 బిలియన్ డాలర్ల నుండి 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రయత్నిస్తున్నాం. తద్వారా దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాము.

మౌలిక సదుపాయాల కల్పన కోసం తెలంగాణలో పెట్టుబడి రేటును ప్రస్తుత 37 శాతం నుంచి 50 శాతానికి పెంచాల్సి ఉంది.రాష్ట్రాల ద్రవ్య లోటు పరిమితిని ఏడాదికి కనీసం 4 శాతానికి పెంచాలి.

రాష్ట్రాలకు ఇస్తున్న 50 ఏళ్ల వడ్డీ లేని రుణాలను గ్రాంట్లుగా మార్చాలని, ఆ సహాయాన్ని రెట్టింపు చేయాలని కోరుతు న్నాము.

విద్య, ఆరోగ్య రంగాల కోసం సేకరించే వనరులను పరిమితుల నుంచి మినహాయించాలి.తెలంగాణలో ప్రస్తుతం 1000కి పైగా కులాల వారీగా రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. మా ప్రభుత్వం 119 నియోజకవర్గాల్లో ఆధునిక వసతులతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోంది. ఇక్కడ అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకుంటారు. అనేక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలను కూడా ఏర్పాటు చేస్తున్నాము.

కేంద్రం తన మొత్తం వ్యయంలో 20 శాతం కంటే ఎక్కువ రాష్ట్ర, ఉమ్మడి జాబితా అంశాలపై ఖర్చు చేస్తోంది. ఇందులో 25 శాతం తగ్గించి, ఆ రూ.2.21 లక్షల కోట్లను నేరుగా రాష్ట్రాలకు బదిలీ చేయాలని సూచిస్తున్నాము.

ప్రస్తుతం సెస్‌లు, సర్‌ఛార్జీల వాటా కేంద్ర పన్ను రాబడిలో 20 శాతానికి చేరింది. దీని వల్ల 15వ ఆర్థిక సంఘం 41 శాతం పన్ను బదిలీని సిఫార్సు చేసినప్పటికీ.. రాష్ట్రాలకు కేవలం 30 శాతం మాత్రమే అందుతోంది.

దాదాపు రూ1,55,000 కోట్ల సర్ ఛార్జీలను మౌలిక సదుపాయాల నిధికి మళ్లించాలి. లేదా వాటిని ప్రాథమిక పన్ను రేట్లలో కలిపి రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి.

తెలంగాణలో ప్రాంతీయ రింగ్ రోడ్ ప్రాజెక్టును తక్షణమే మంజూరు చేయాలని కోరుతున్నాము.

హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2: దీనికి సంబంధించి త్వరగా నిర్ణయం తీసుకుని అనుమతులు ఇవ్వాలి.

విద్య: హైదరాబాద్‌లో ఎఐఎం ఏర్పాటును ప్రకటించాలి.

మిగిలిన జిల్లాల్లో కేంద్రీయ, జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలి.

పెద్దపల్లి, వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో విమానాశ్రయాలను మంజూరు చేయాలి.

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం దీనిని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలి.

మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం రూ14,100 కోట్లు, రేడియల్ రోడ్ల కోసం రూ45,000 కోట్లు, హైదరాబాద్ మురుగునీటి పారుదల ప్రణాళిక కోసం రూ17,212 కోట్లు కేటాయించాలి.

సహకార సమాఖ్య స్ఫూర్తితో మా అభ్యర్థనలను సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నాము.. అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## తెలంగాణ గ్రామీణ జిల్లాల క్రీడాకారులు ఐపీఎల్ స్థాయికి ఎదగాలి : మంత్రి వివేక్ వెంకటస్వామి



హనుమకొండ చౌరస్తా, జనవరి 10: రాబోయే కాలంలో తెలంగాణ గ్రామీణ జిల్లాల క్రీడాకారులు ఐపీఎల్ స్థాయికి ఎదగాలని తెలంగాణ గనులు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖ ఇండస్ట్రీ సౌజన్యంతో ఫేస్-2 విభాగంలో మూడు రోజులుగా కరుణాపురంలోని వంగాలపల్లి వరంగల్ డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్ క్రికెట్ మైదానంలో జరుగుతున్న కాక వెంకటస్వామి మెమోరియల్ టీ-20 పోటీల్లో ముగింపు కార్యక్రమాలకి గడ్డం వివేక్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు.

కరీంనగర్ చివరి మ్యాచ్‌ను ఆదిలాబాద్‌ల మధ్య మ్యాచ్‌ను టాస్ వేసి ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. జిల్లాలు నుంచి ఐపీఎల్‌స్థాయికి ఎదిగేలా తను హెచ్‌సీఏ ప్రెసిడెంట్ నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నానని.. అందులో గత దశాబ్దంగా విశాఖ ఇండస్ట్రీ సౌజన్యంతో తనే స్వంతగా కాక వెంకటస్వామి మెమోరియల్ టోర్నమెంట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో పాల్గొన్న ఎంతోమంది ఇప్పటికే హెచ్‌సీఏలో వెలుగులోకి వస్తున్నందుకు కాక కుటుంబ సభ్యులకి మరింత ఆనందం కలిగించే విషయమన్నారు.

కుడా చైర్మెన్, మాజీ హెచ్‌సీఏ ప్రెసిడెంట్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్టేడియం నిర్మాణానికి నిధుల విషయంలో కానీ.. స్థల అనుమతులలో కానీ తను 2011 నుంచి ముందుపడి పనిచేస్తున్న విషయాన్ని పలు దఫాలుగా రాష్ట్ర ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలో స్టేడియం మంజూరు విషయమై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆమోదం తీసుకువచ్చామని త్వరలో స్టేడియం కల సాధ్యం కాబోతుందని తెలిపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ.. మూడు తరాలు క్రీడల్లోనే కాకుండా వైద్య, ఆరోగ్య విషయాల్లో కాక కుటుంబం నిరంతరం సేవచేస్తూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా నిలుస్తుందని కొనియాడారు. జిల్లాల క్రికెట్ ఛైర్మన్ ఆగం రావు మాట్లాడుతూ.. గ్రామీణ జిల్లాల్లో ఇలాంటి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణ ద్వారానే క్రీడాకారులు వెలుగులోకి వస్తారని తెలిపారు.

వరంగల్ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రెండు దశల్లో కాక వెంకటస్వామి మెమోరియా టోర్నమెంట్‌లో వరంగల్ జట్టు వేదిక చేయడమే కాకుండా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 3 జిల్లాలో ఏకకాలంలో టర్ఫ్ వికెట్ల మధ్య ఈ టోర్నమెంట్ నిర్వహణ చేసి హైదరాబాద్‌కి పోటీగా వరంగల్ జిల్లా నిలుస్తుందని, గ్రామీణ జిల్లాల క్రికెట్ అభివృద్ధిగాను వివేక్ వెంకటస్వామి తమపై పెట్టుకున్న నమ్మకానికి అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకున్నామని తెలిపారు. సభ అధ్యక్షుడిగా పెద్ది ప్రవీణ్‌గౌడ్ వ్యవహరించగా, ఉపాధ్యక్షుడు అచ్చ వెంకటేశ్వర్లు రావు, సదాశివు, తోట రాము, సంయుక్త కార్యదర్శి ఉపేందర్, కార్యవర్గ సభ్యులు అభినవ వినయ్, కోచ్ ప్రణయ్, శంకర్ పాల్గొన్నారు.

తొలి మ్యాచులో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హైదరాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లు ఎదుర్కొని 6 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేయగా.. హైదరాబాద్ జట్టులో వినీత్ పవర్ 3 సిక్సర్లతో 5 బౌండరీ సహాయంతో 65 పరుగులు భారీ లక్ష్యం నిర్దేశించారు. 165 పరుగుల లక్ష చేదనలో బరిలోకి దిగిన వరంగల్ జట్టు 19 ఓవర్లు మాత్రమే ఎదుర్కొని 141 పరుగులు సాధించి ఆలౌట్ కావడంతో 23 పరుగుల తేడాతో ఓటమి చెందింది.

వరంగల్ జిల్లాలో నిక్షిత్ బౌలింగ్‌లో 4 వికెట్లు బ్యాటింగ్‌లో 30 పరుగు సాధించింది. మిగిలిన వారు కీలక సమయంలో విఫలం చెందటంతో ఓటమి చెవిచూశారు. హైదరాబాద్ ప్లేయర్ వినీత్‌కి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డ్ మంత్రి వివేక్ చేతుల మీదుగా అందించారు.

కరీంనగర్ ఆదిలాబాద్ జట్ల మధ్య జరగగా ఆదిలాబాద్ జట్టు నిర్ణీత 18 ఓవర్లు ఎదుర్కొని 9 వికెట్లు కోల్పోయి 133 పరుగులు సాధించింది. ఆదిలాబాద్ జట్టులో సంతోష్ కేవలం 44 బంతుల్లో 4 సిక్సర్లతో, 4 బౌండరీ సహాయంతో 133 పరుగులు చేసి రాణించాడు. 134 లక్ష చేదనలో బరిలోకి దిగిన కరీంనగర్ జట్టు ఎదుర్కుంటుంది.

## మీడియా సంస్థలు అలా చేయడం సరికాదు: మహేశ్ గౌడ్

హైదరాబాద్, జనవరి 10: తెలంగాణకు చెందిన మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ మీడియాలో తప్పుడు కథనాలు ప్రసారమవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై చర్చ చేయడం బాధాకరమని అన్నారు. వాస్తవానికి దూరంగా కథనాలు వస్తున్నాయని ఆగ్రహించారు. ఎంతో కష్టపడితే తప్ప మంత్రులు ఈ స్థాయికి చేరుకోరని.. అలాంటి వారిపై మీడియా సంస్థలు నిరాధారమైన వార్తలను ప్రచురించడం మానేయాలని విజ్ఞప్తి చేశారు. ఇవాళ(శనివారం) గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. శ్రీరాముడికి బీజేపీలో సభ్యత్వం ఉందా.. అని ప్రశ్నించారాయన. రాముడి పేరును వాడుకునే హక్కు బీజేపీకి ఎక్కడిది అని నిలదీశారు. రాజకీయాల్లోకి దేవుడిని లాగడం మంచిది కాదని హితవు పలికారు. ఓట్ల కోసం దేవుడిని వాడుకోవడం సరికాదని చెప్పుకొచ్చారు మహేశ్ కుమార్ గౌడ్.

'కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణా యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో బీఆర్ఎస్ నేతలు శ్వేతపత్రం విడుదల చేయాలి. మేం రెండేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చామో శ్వేతపత్రం విడుదల చేస్తాం. కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారు. కవిత వ్యవహారంతో కేటీఆర్, హరీశ్‌రావు బాధపడుతున్నారు. కేసీఆర్ కుటుంబ అవినీతి బాగోతంపై కవిత నిజాలు చెబుతున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాలు గెలుస్తాం, పంచాయతీ ఎన్నికల్లో 70 శాతం స్థానాలు గెలిచాం. కంటోన్‌మెంట్, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలిచాం. కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలనే తపన ప్రజల్లో కనిపిస్తోంది. పేర్లు మార్చడం వల్ల ప్రజలకు వచ్చేదే మీ లేదు. పేర్ల మార్పునకు ముందు ఆయా జిల్లాలకు ఏమేం చేశారో చెప్పాలి. ప్రజల దృష్టి మళ్లించేందుకే పేరు మార్పు అంశాన్ని తెరపైకి తెస్తున్నారు' అని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## సంక్రాంతి పండుగ సందర్భంగా పల్లెలకు క్యూ కట్టిన హైదరాబాద్ నగరవాసులు

**-కిక్కిరిసిపోయిన విజయవాడ జాతీయ రహదారి**

హైదరాబాద్ జనవరి 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ నగరవాసులు పల్లెలకు క్యూ కట్టారు. ఏపీకి వెళ్లే వారి వాహనాలతో హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి కిక్కిరిసిపోయింది. శనివారం ఉదయం హైవేపై వాహనాల రద్దీ పెరిగింది. దీంతో చౌటుప్పల్, పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి. వాహనాల రద్దీ నేపథ్యంలో పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు. భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాలకు చేరుకోవాలని.. గుంటూరు, ఒంగోలు వైపు వెళ్లే వారు సాగర్ హైవే మీదుగా వెళ్లాలని సూచించారు.సంక్రాంతి సెలవులు ప్రారంభం కావడంతో ఎంజీబీఎస్, జేబీఎస్‌లోనూ రద్దీ పెరిగింది. ఉప్పల్, ఎల్బీనగర్, తార్నాక కూడళ్ల వద్ద కూడా బస్సుల కోసం జనాలు బారులు తీరారు. అయితే రద్దీకి తగ్గట్లుగా ఆర్టీసీ బస్సులను నడపకపోవడంతో జనాలు ఇబ్బందులు పడుతున్నారు. జనగామ బస్సు కోసం దాదాపు గంటన్నర ఎదురుచూస్తే ఒక్క బస్సు వచ్చిందని.. స్పెషల్ బస్సు పేరిట అందులోనూ రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారని ప్రయాణికులు మండిపడుతున్నారు.

## చలి తీవ్రతకు వణుకుతున్న ఢిల్లీ.. పొగమంచుతో వాహనాల రాకపోకలకు అంతరాయం

న్యూఢిల్లీ, జనవరి 10: చలి తీవ్రతకు దేశ రాజధాని ఢిల్లీ గజగజ వణికిపోతోంది. ఉష్ణోగ్రతలు అత్యంత కనిష్ట స్థాయికి పడిపోయాయి శనివారం ఉదయం రాజధానిలో ఉష్ణోగ్రతలు 4.2 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. ఇప్పటి వరకూ ఈ సీజన్‌లో ఇదే అత్యల్ప ఉష్ణోగ్రతలు అని భారత వాతావరణ శాఖ తెలిపింది.నగరంలో కనిష్ట ఉష్ణోగ్రతలు సీజన్ సగటు కంటే 2.7 డిగ్రీల కంటే తక్కువగా నమోదయ్యాయి. సఫ్దర్‌జంగ్ అబ్జర్వేటరీలో ఉష్ణోగ్రతలు 4.2 డిగ్రీల సెల్సియస్, పాలంలో 4.5 డిగ్రీల సెల్సియస్, లోధి రోడ్డులో 4.7 డిగ్రీల సెల్సియస్, రిడ్జ్‌లో 5.3 డిగ్రీల సెల్సియస్, అయానగర్‌లో 4.5 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి తీవ్రతకు నగర వాసులు వణికిపోతున్నారు. చలిమంటలు వేసుకొని ఉపశమనం పొందుతున్నారు.మరోవైపు నగరంలో దట్టంగా మంచు కురుస్తోంది. దీంతో విజిబిలిటీ జీరోకు పడిపోయింది. ఫలితంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పొగమంచు పరిస్థితులు విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపింది. ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించే అనేక విమానాలు రద్దయ్యాయి కొన్ని ఆలస్యంగా నడుస్తుండగా.. మరికొన్నింటిని దారి మళ్లించారు.

# జై జవాన్, జై కిసాన్ నినాద రూపశిల్పి : లాల్ బహదూర్ శాస్త్రి

## (11 జనవరి స్వతంత్ర భారత 2వ ప్రధాని "లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి" సందర్భంగా)

స్వతంత్ర భారత రెండవ ప్రధాన మంత్రి, పరమ దేశభక్తుడు, అద్వితీయ దార్శనికుడు లాల్ బహదూర్ శాస్త్రి 11 జనవరి 1966న ఉబ్జెకిస్థాన్, రష్యాలో ఉదయం తుది శ్వాస విడిచారు. 1965 ఇండో-పాక్ యుద్ధం తర్వాత రెండు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణాన్ని తగ్గించేలా ప్రయత్నాల్లో భాగంగా "తాష్కంట్ ఒప్పందం"లో సంతకం చేయడానికి వెళ్లిన లాల్ బహదూర్ శాస్త్రీ అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించం, మరణానంతరం పోస్ట్‌మార్టమ్ కూడా చేయకపోవడం, గుండె పోటుతో మరణించారని అధికారిక ప్రకటన చేయడం గత 60 ఏండ్లుగా వారి మరణం వీడని మిస్టరీగానే మిగిలి పోవడం విచారకరం.

జై జవాన్ ; జై కిసాన్ నినాదమిచ్చిన భారత రత్న:

"జై జవాన్ ; జై కిసాన్" అనబడే అత్యంత శక్తివంతమైన, అవసరమైన నిత్య నినాదాన్ని ఇచ్చిన లాల్ బహదూర్ శాస్త్రి దేశాభివృద్ధిలో రైతులు, సైనికుల పాత్రను నొక్కివక్కానించారు. అపరిమిత అంకితభావం, నైతిక ప్రవర్తన, నీతివంతమైన పాలన, పారదర్శకత, జవాబుదారీతనం, ప్రధాని పదవి ఇన్నప్పటికీ అత్యంత సరసమైన జీవన విధానాన్ని కొనసాగించడం, దేశ భద్రతపై పట్టు సాధించి భరతమాత ముద్దు బిడ్డగా చరిత్రలో నిలిచారు. 1965లో జరిగిన ఇండో-పాక్ యుద్ధంలో శాస్త్రి చూపిన తెగువ, భారత్‌ను యుద్ధంలో విజేతగా నిలిపి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రధానిగా శాస్త్రి ప్రతిభగల పాలన విధానాలు దేశానికి రాజకీయ, ఆర్థిక పునాదులను పటిష్ట పరిచారు.

శాస్త్రీ బిరుదాంకితుడు:

యూపీ, ముగల్‌సరాయ్ నగరంలోని ఒక సాధారణ కుటుంబంలో 02 అక్టోబర్ 1904న జన్మించిన లాల్ బహదూర్ కాశీ విద్యాపీఠ్ ప్రాంగణంలో డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం స్వాతంత్ర్య సమరంలో చురుకుగా పాల్గొంటూ మహాత్మా గాంధీతో దగ్గర అయ్యారు. చదువుకున్న సమయంలోనే లాల్ బహదూర్ చూపిన ప్రతిభను మెచ్చి "శాస్త్రి" అనే మేధావిగా బిరుదును పొందారు. స్వతంత్ర భారత ప్రభుత్వంలో రైల్వే/విదేశాంగ/హోమ్ లాంటి మంత్రి పదవులను నిర్వహించి తన పాలనాదక్షతను రుచి చూపి 2వ ప్రధాన మంత్రిగా 1964-66 మధ్య సేవలు అందిస్తూ అకాల మరణం చెందారు. శాస్త్రీ గారి అకాల, అనుమానాస్పద మరణం నాటి దేశానికి తీరని వేదనను మిగిల్చింది.

అజాతశత్రువు, అలుపెరుగని సేవకుడు, నీతి నిజాయితీకి మారుపేరు, నిత్య కృషీవలుడు, ఆలోచనపరమైన ముందు చూపు, ఆధునిక భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన దేశ భక్తిపరుడి 59వ వర్ధంతి సందర్భంగా శాస్త్రి గారి స్మారక "విజయ్ ఘాట్" సాక్షిగా హృదయపూర్వక నివాళులు అర్పిద్దాం. శాస్త్రి గారి సేవలకు గుర్తింపుగా మరణానంతరం 1966లో "భారత రత్న" పౌర పురస్కారం కూడా ఇవ్వడం సముచితంగా ఉన్నది. లాల్ బహదూర్ శాస్త్రీ జీవితం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలవాలని, దేశ పౌర సమాజానికి దారి దీపం కావాలని కోరుకుందాం.

- ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# భారతీయ ఉమ్మడి ధర్మాన్ని కాపాడుతున్న భాషా వైవిధ్యం: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, జనవరి 10:భారతీయ భాషలపై మూడో అంతర్జాతీయ సదస్సును న్యూఢిల్లీలో భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ నేడు ప్రారంభించారు. ఈ సమావేశాన్ని వైశ్విక్ హిందీ పరివార్, అంతర్జాతీయ సహకార పరిషత్, ఇందిరాగాంధీ జాతీయ కళా కేంద్రం, ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని భారతీయ భాషా విభాగం నిర్వహించాయి.

పండితులు, భాషావేత్తలు, అంతర్జాతీయ ప్రతినిధులను ఉద్దేశించి ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. భాషను నాగరికతకు మనస్సాక్షిగా అభివర్ణించారు. ఇది తరతరాలుగా సామూహిక స్మృతులను, జ్ఞాన వ్యవస్థలు, విలువలను కలిగి ఉంటుందని అన్నారు. ప్రాచీన శిలాశాసనాలు, తాళపత్ర గ్రంథాల నుంచి నేటి డిజిటల్ లిపిల వరకు.. మానవత్వాన్ని నిర్వచించే తత్వాలు, శాస్త్రాలు, కవిత్వం, నైతిక సంప్రదాయాలను భాషలు సంరక్షిస్తున్నాయని ఆయన తెలిపారు.

చెన్నైలో ఇటీవల జరిగిన సిద్ధ దినోత్సవ వేడుకలలో తాను పాల్గొన్న విషయాన్ని ఉపరాష్ట్రపతి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

అక్కడ భారతదేశపు విస్తారమైన, బహుభాషా జ్ఞాన సంప్రదాయాలకు శాశ్వత సాక్ష్యంగా నిలిచే అనేక తాళపత్ర గ్రంథాలను చూసినట్లు చెప్పారు. ప్రతి భారతీయ భాష కూడా తత్వశాస్త్రం, వైద్యం, విజ్ఞాన శాస్త్రం, పరిపాలన, ఆధ్యాత్మికతకు ఎంతో కృషి చేసిందని ఆయన పేర్కొన్నారు.

దేశంలోని అనేక భాషలు భారత్‌ను ఎప్పుడూ విభజించలేదని.. బదులుగా అవి ఒక ఉమ్మడి నాగరికత విలువలను, ఉమ్మడి ధర్మాన్ని సంరక్షించి బలోపేతం చేశాయని ఉపరాష్ట్రపతి తెలిపారు.

రాజ్యసభ చైర్మన్‌గా తన తొలి పార్లమెంటు సమావేశాల అనుభవాన్ని పంచుకుంటూ.. ప్రస్తుతం అధిక సంఖ్యలో పార్లమెంటు సభ్యులు మాతృభాషల్లో ప్రసంగిస్తున్నారని ఉపరాష్ట్రపతి తెలిపారు. భారత రాజ్యాంగ అనువాద ప్రతులను ఇటీవల భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము సంతాలి భాషలో విడుదల చేశారని, ఇది భాషా సమ్మిళితత్వానికి, అన్ని భాషలపై ప్రజాస్వామ్య గౌరవాన్ని ప్రతిబింబించే కీలక ప్రయత్నంగా ఆయన అభివర్ణించారు.

భారత రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్ భాషా వైవిధ్యాన్ని గుర్తించి గౌరవించడం దేశ ప్రాచీన విజ్ఞానాన్ని ప్రతిబింబిస్తుందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. జాతీయ సమగ్రత ఏకరూపతపై కాకుండా, పరస్పర గౌరవం మీద ఆధారపడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రతి పౌరుడు తన సొంత భాషలో భావాలను వ్యక్తపరచగలిగినప్పుడే ప్రజాస్వామ్యం వికసిస్తుందని అన్నారు.

సమకాలీన సవాళ్లను ప్రస్తావిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా అనేక స్థానిక భాషలు అంతరించిపోయే దశలో ఉన్నాయని ఉపరాష్ట్రపతి హెచ్చరించారు

. పరిశోధనలను, అంతర్జాతీయ విద్యా సహకారాన్ని పెంపొందించడంలో, ప్రాచీన లిపులు, తాళపత్ర గంథ్రాలను ముఖ్యంగా అంతరించిపోతున్న భాషలను సంరక్షించడంలో ఇలాటి భాషా సమావేశాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలో చేపట్టిన కార్యక్రమాలను ప్రస్తావిస్తూ.. బహుభాషా విద్యను ప్రోత్సహించే జాతీయ విద్యా విధానం 2020ను ఉపరాష్ట్రపతి వివరించారు. భారతీయ భాషల తాళపత్ర గ్రంథాలను సంరక్షించి, వ్యాప్తి చేస్తున్న జ్ఞాన భారతం మిషన్‌ను ఆయన అభినందించారు. జ్ఞానం పవిత్రమైన, దానిని అందరితో వంచుకోవాలనే భారతీయ నమ్మకాన్ని ఇది పునరుద్ఘాటిస్తుందని ఆయన అన్నారు.

భాషా సంరక్షణలో సాంకేతికత ఒక మిత్రుడిగా మారాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. భారతీయ భాషలు వర్తమానంలో అభివృద్ధి చెందుతూ, భవిష్యత్తును తీర్చిదిద్దేలా డిజిటల్ ఆర్కైవ్‌లు, కృత్రిమ మేధ ఆధారిత అనువాద సాధనాలు, బహుభాషా వేదికలను ఉపయోగించాలని ఉపరాష్ట్రపతి సూచించారు.

భాషలను సంరక్షించడం ద్వారా దేశం తన నాగరికతలను కాపాడుకుంటుందని ఉపరాష్ట్రపతి తెలిపారు. భాషా వైవిధ్యాన్ని పెంపొందించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందని, ప్రతి భాషను గౌరవించడం ద్వారా మానవత్వపు గౌరవాన్ని కాపాడుతుందని చెబుతూ తన ప్రసంగాన్ని ముగించారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ విద్యాశాఖ మంత్రి డాక్టర్ రమేష్ పోఖ్రియాల్ 'నిశాంక్', ఇందిరాగాంధీ జాతీయ కళా కేంద్రం చైర్మన్ శ్రీ రామ్ బహదూర్ రాయ్, అంతర్జాతీయ సహకార మండలి సెక్రటరీ జనరల్ శ్రీ శ్యామ్ పరాండేతో పాటు దేశ విదేశాల నుంచి వచ్చిన పండితులు, విద్యావేత్తలు, భాషావేత్తలు, పరిశోధకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# విగ్రహ ఏర్పాటు పనుల పరిశీలన

అమరావతి, జనవరి 10:గన్నవరంలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహ ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నిర్మాణ పనులను గన్నవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విగ్రహాన్ని క్రేన్ సహాయంతో పీఠంపై అమర్చుతున్న ప్రక్రియను ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ఎన్టీఆర్ విగ్రహం గన్నవరం నడిబొడ్డున ఒక విశిష్ట గుర్తింపుగా నిలిచేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విగ్రహం చుట్టూ జరుగుతున్న ఇతర నిర్మాణ పనులను, నాణ్యతను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ప్రారంభోత్సవానికి సమయం దగ్గరపడుతున్నందున, ఎక్కడా జాప్యం లేకుండా పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు

నిర్ణీత గడువులోగా విగ్రహ ఆవిష్కరణకు సిద్ధం చేయాలని, ఫినిషింగ్ పనుల్లో ఏమాత్రం రాజీ పడకూడదని ఆయన స్పష్టం చేశారు. ఎన్టీఆర్ విగ్రహం గన్నవరం నియోజకవర్గానికే తలమానికంగా ఉండేలా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు.

# శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

## -మతవిద్వేష శక్తుల పట్ల బీ అలెర్ట్

## -కాకినాడ పోలీస్ ఆఫీసర్లతో డిప్యూటీ సీఎం భేటీ



కాకినాడ జనవరి 10: శాంతి భద్రతల పరిరక్షణ వ్యవహారంలో కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కాకినాడ పోలీసు అధికారులకు సూచించారు. లా అండ్ ఆర్డర్ నిర్వహణ పకడ్బందీగా ఉండాలి, నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి, ఉల్లంఘనలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించవద్దు, అని డిప్యూటీ సీఎం ఆదేశించారు. కులాల మధ్య మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూసే శక్తుల పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగా పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని చెప్పారు. శనివారం మధ్యాహ్నం కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించారు.

కమాండ్ కంట్రోల్ రూం, ఆఫీసర్స్ జిమ్ తదితర విభాగాలను పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ రూంలో డయల్ 100 పని తీరుపై ఆరా తీశారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితులు ఫోన్ చేసినప్పుడు సాంకేతికత సాయంతో లొకేషన్ ఎలా గుర్తిస్తారు దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ సిబ్బందికి సమాచారం ఎలా చేరవేస్తారు.. తదితర అంశాలను పోలీస్ అధికారులు వివరించారు. స్నేహపూర్వక సేవలు అందిస్తూ పోలీస్ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ సూచించారు.

# సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



అమరావతి, జనవరి 10: గ్రామీణ ప్రాంతాల్లో సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఏకైక పండుగ మకర సంక్రాంత అని శ్రీరామ పాఠశాల కారస్పాండెంట్ మోహన్ చంద్ అన్నారు. మండలం కేంద్రమైన శావల్యాపురంలో ఉన్న శ్రీరామ పబ్లిక్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి పర్వదిన వేడుకలు అత్యంత ఆనందోత్సాహాలతో, సాంప్రదాయ వైభవంతో ఇవాళ ఘనంగా నిర్వహించారు.

పాఠశాల స్థాయిలో విద్యార్థులకు ముగ్గులు, గాలిపటాలు ఎగరవేయటం పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ ప్రాధాన్యత తెలిపే వివిధ అలంకరణలు అలాగే విద్యార్థులు హరిదాసు గంగిరెద్దులు వంటి విన్యాసాలతో అలరించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా కెవిఆర్ మోహన్ చందు మాట్లాడుతూ తెలుగువారి సంస్కృతి సంప్ర దాయాల విశిష్టత సంక్రాంతి పండుగ అని చెప్పారు. ఆరుగాలం శ్రమించిన రైతులకు పంట చేతికి వచ్చే సమయం గ్రామీణ ప్రాంతంలో రైతులు కూలీలు ఎంతో ఆనందంగా జరుపుకునే ముఖ్యమైన పండుగ సంక్రాంతి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కే.రత్నకుమారి, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జనవరి 10, 11 తేదీల్లో గుజరాత్‌లోని సోమనాథ్‌లో నిర్వహించే

## సోమనాథ స్వాభిమాన పర్వంలో పాల్గొననున్న ప్రధాని

న్యూఢిల్లీ, జనవరి 10:జనవరి 10, 11 తేదీల్లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గుజరాత్‌లోని సోమనాథ్‌లో పర్యటిస్తారు. సోమనాథ్ స్వాభిమాన్ పర్వంలో పాల్గొంటారు. జనవరి 10న రాత్రి 8 గంటలకు సోమనాథ ఆలయంలో నిర్వహించే ఓంకార మంత్రోచ్చారణలో పాల్గొంటారు. అలాగే డ్రోన్ ప్రదర్శనను వీక్షిస్తారు.

సోమనాథ ఆలయాన్ని రక్షించడంలో తమ ప్రాణాలను త్యాగం చేసిన వీరులను స్మరించుకుంటూ జనవరి 11, ఉదయం 9:45కు నిర్వహించే శౌర్య యాత్రలో ప్రధాని పాల్గొంటారు. ధైర్యాన్ని, త్యాగాన్ని ప్రతిబింబిస్తూ.. 108 అశ్వాలను ఈ యాత్రలో ఊరేగిస్తారు. ఆ తర్వాత ఉదయం 10:15 గంటలకు సోమనాథ్ దేవాలయాన్ని సందర్శించి పూజలు నిర్వహిస్తారు. ఉదయం 11:00లకు సోమనాథ్‌లో జరిగే బహిరంగ సభలో ప్రధానమంత్రి పాల్గొంటారు.

2026 జనవరి 8 నుంచి 11 వరకు సోమనాథ్ స్వాభిమాన్ పర్వాన్ని సోమనాథ్‌లో నిర్వహిస్తున్నారు. ఈ ఆలయాన్ని రక్షించేందుకు అనేక త్యాగాలు చేసిన భారతీయ పౌరులను స్మరించుకోవడానికి, భవిష్యత్తు తరాల్లో సాంస్కృతిక స్పృహను నింపడానికి దీనిని నిర్వహిస్తున్నారు.

1026 సంవత్సరంలో సోమనాథ్ ఆలయంపై మహమ్మద్ గజినీ దాడి చేసి 1,000 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఆలయాన్ని ధ్వంసం చేయడానికి శతాబ్దాల తరబడి అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ పునరుజ్జీవనానికి, నమ్మకానికి, జాతీయ స్ఫూర్తికి, ప్రాచీన వైభవాన్ని పునరుద్ధరించడంలో సమష్టి స్ఫూర్తికి, ప్రయత్నాలకు ప్రతీకగా సోమనాథ్ ఆలయం నిలిచింది.

స్వాతంత్ర్యానంతరం, ఈ ఆలయాన్ని సర్దార్ పటేల్ పునరుద్ధరించారు. ఈ ఆలయ పునరుజ్జీవన ప్రయాణంలో ముఖ్యమైన ఘట్టాన్ని 1951 సూచిస్తుంది. అప్పటి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ సమక్షంలో ఈ ఆలయాన్ని భక్తుల సందర్శన కోసం అధికారికంగా తెరిచారు. ఈ ఏడాదితో ఆ ఆలయాన్ని పునరుద్ధరించి 75 వసంతాలు పూర్తవడంతో.. సోమనాథ స్వాభిమాన్ పర్వానికి 2026 ప్రత్యేకతను చేకూరుస్తుంది.

దేశం నలుమూలలకు చెందిన వందలాది మంది సాధువులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. ఆలయ ప్రాంగణంలో 72 గంటల పాటు ఓంకార మంత్రాన్ని జపిస్తారు.

సోమనాథ్ స్వాభిమాన పర్వంలో ప్రధానమంత్రి పాల్గొనడం.. భారతీయ నాగరికత శాశ్వత స్ఫూర్తిని తెలియజేస్తుంది. అలాగే, సుసంపన్నమైన భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వాన్ని పరిరక్షించడంలో ఆయన నిబద్ధతను తెలియజేస్తుంది.

# నాగరికతా నైతిక విలువల్లో మమేకమైన భారత వాతావరణ చర్యలు: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, జనవరి 10:నేడు న్యూఢిల్లీలో జరిగిన "భారత్ క్లైమేట్ ఫోరం 2026" ప్రారంభోత్సవంలో భారత ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి. రాధాకృష్ణన్ ప్రసంగించారు. వాతావరణ చర్యలు దేశ అభివృద్ధికి అడ్డంకి కాదని, అవి సమగ్ర వృద్ధిని వేగవంతం చేయడానికి, ఇంధన భద్రతను బలోపేతం చేయడానికి, భవిష్యత్తు అవసరాలకు తగినట్లుగా ఆర్థిక వ్యవస్థను నిర్మించేందుకు ఒక వ్యూహాత్మక అవకాశమని ఆయన పేర్కొన్నారు.

లోతైన ఆలోచనలు, అర్థవంతమైన చర్యల కోసం ఈ ఫోరాన్ని ఒక జాతీయ వేదికగా తీర్చిదిద్దిన 'అంతర్జాతీయ ఆర్థిక అవగాహన మండలి' సంస్థను ఉపరాష్ట్రపతి అభినందించారు. వాతావరణం, సుస్థిరత్వం వంటి అంశాలపై దేశానికి ఉన్న అనుబంధం మన నాగరికత విలువల్లో లోతుగా నిక్షిప్తమై ఉందని ఆయన పేర్కొన్నారు. స్థిరత్వం సమకాలీన ఆందోళనగా ఉద్భవించడానికి చాలా కాలం ముందే మానవ కార్యకలాపాలు, ప్రకృతి మధ్య సమతుల్యత అవసరమని భారతీయ ఆలోచన ధోరణి తెలియజేసిందని ఆయన అన్నారు. ఇది మన సాంప్రదాయ జల సంరక్షణ పద్ధతులు, సుస్థిర వ్యవసాయ విధానాలు, జీవవైవిధ్య పరిరక్షణ, ప్రకృతి, అపరిగ్రహ వంటి నైతిక సూత్రాల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తుందని ఉపరాష్ట్రపతి వివరించారు.

గత దశాబ్ద కాలంలో దేశ అభివృద్ధి ప్రయాణాన్ని ప్రస్తావిస్తూ.. వృద్ధి, సమానత్వం, ప్రస్తుత అవసరాలు, భవిష్యత్తు బాధ్యతల మధ్య భారత్ నిరంతరం సమతుల్యతను పాటిస్తూ ముందుకు సాగిందని ఉపరాష్ట్రపతి అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో అభివృద్ధి చెందుతున్న దేశం వాతావరణ బాధ్యతను ఎలా స్వీకరించాలనే విషయంలో ప్రాథమికంగా భారత్ సరికొత్త నిర్వచనాన్ని ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు.

సీఓపీ-26 సదస్సులో భారత్ ప్రకటించిన పంచామృత ప్రతిజ్ఞలను ఉపరాష్ట్రపతి ప్రస్తావించారు. 2070 నాటికి నికర శూన్య ఉద్గారాలను సాధించడం, తక్కువ కార్బన్ ఉద్గారాల భవిష్యత్తు వైపు ఈ లక్ష్యాలు స్పష్టమైన మార్గాన్ని చూపుతాయని ఉపరాష్ట్రపతి అన్నారు. అదే సమయంలో ఇవి దేశ అభివృద్ధి ప్రాధాన్యతలను, భవిష్యత్తు తరాల పట్లపై మనకున్న బాధ్యతను పునరుద్ఘాటిస్తాయని తెలిపారు.

స్వచ్ఛ సాంకేతికతల తయారీ ప్రాధాన్యతను ఉపరాష్ట్రపతి వివరించారు. అభివృద్ధి చెందిన భారతదేశాన్ని కేవలం దిగుమతి చేసుకున్న సాంకేతికతలు లేదా బలహీనమైన సరఫరా వ్యవస్థలపై ఆధారపడి నిర్మించడం సాధ్యం కాదని ఆయన అన్నారు. దేశీయంగా అభివృద్ధి చేసిన స్వచ్ఛ సాంకేతికతలు, దృఢమైన తయారీ వ్యవస్థ, భవిష్యత్తుకు అవసరమైన కార్మిక శక్తి పై ఆధారపడి ఉండాలని స్పష్టం చేశారు. పునరుత్పాదక శక్తి, ఇంధన నిల్వలు, గ్రీన్ హైడ్రజన్, ఎలక్ట్రిక్ వాహనాలు, స్థిరమైన పదార్థాలు, వాతావరణానికి అనుకూలమైన వ్యవసాయం, డిజిటల్ వాతావరణ పరిష్కారాలు వంటి రంగాల్లో భారత్ ప్రపంచస్థాయి తయారీ కేంద్రంగా ఎదుగుతోందని తెలిపారు. ఇది మన మేక్ ఇన్ ఇండియా నినాదాన్ని ప్రపంచం కోసం మేక్ ఇన్ ఇండియాగా మారుస్తోందని పేర్కొన్నారు.

భారతీయ కంపెనీలు సోలార్ మాడ్యూల్స్, బ్యాటరీ తయారీ, ఎలక్ట్రిక్ వాహనాల విడిభాగాలు, ఎలక్ట్రోలైజర్లు, గ్రీన్ ఫ్యూయల్స్‌లో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయని ఉపరాష్ట్రపతి చెప్పారు. వాతావరణ డేటా, ఇంధన సామర్థ్యం, వ్యర్థాల నిర్వహణలో అంకుర సంస్థలు సరికొత్త ఆవిష్కరణలకు నాయకత్వం వహిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

ప్రపంచ సహకారం గురించి ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. వాతావరణ మార్పు ఒక ఉమ్మడి సవాలని దీనిని ఎదుర్కొనేందుకు సమిష్టి చర్య అవసరమని అన్నారు. భాగస్వామ్యాల విషయంలో భారతదేశ విధానం 'ఎవరిపైనా ఆధారపడకుండా పరస్పర సహకారం' అందించుకోవడమేనని తెలిపారు. అంతర్జాతీయ సౌర కూటమి వెనుక ఒక స్థాపక శక్తిగా, తక్కువ ఖర్చుతో కూడిన, భారీ స్థాయిలో అమలు చేయగల సౌర పరిష్కారాల కోసం భారత్ అభివృద్ధి చెందుతున్న దేశాలను ఏకం చేసిందని ఆయన అన్నారు. వాతావరణ మార్పుల వల్ల కలిగే విపత్తులను తట్టుకోగల మౌలిక సదుపాయాల బలోపేతానికి, అభివృద్ధి ఫలాలు దెబ్బతినకుండా కాపాడటంలో భారత్ చూపుతున్న నాయకత్వం.. భవిష్యత్తు దృష్టిని ప్రతిబింబిస్తుందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలోభారత్ క్లైమేట్ ఫోరం చైర్మన్, రాజ్యసభ మాజీ పార్లమెంటు సభ్యురాలు శ్రీ ఎన్. కె. సింగ్, భారత్ క్లైమేట్ ఫోరం కన్వీనర్, మాజీ కేంద్ర మంత్రి శ్రీమతి మీనాక్షి లేఖి, భారత్ క్లైమేట్ ఫోరం కో-చైర్ శ్రీ సుమంత్ సిన్హా, భారత్ క్లైమేట్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ అశ్వని మహాజన్, ప్రపంచవ్యాప్తంగా ఉన్న విధాన నిర్ణేతలు, పారిశ్రామికవేత్తలు, నిపుణులు, విద్యావేత్తలు, ఇతర భాగస్వాములు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ నుంచి మృతుల కుటుంబాలకు పరిహారం

న్యూఢిల్లీ, జనవరి 10:హిమాచల్ ప్రదేశ్‌లోని సిర్మౌర్‌లో జరిగిన బస్సు ప్రమాదంలో ప్రాణనష్టం పట్ల ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు విచారం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం ప్రకటించారు.

"హిమాచల్ ప్రదేశ్‌లోని సిర్మౌర్‌లో బస్సు ప్రమాదంలో ప్రాణనష్టం అత్యంత విచారకరం. తమ ఆత్మీయులను కోల్పోయిన వారికి నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం అందిస్తాం అని: ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు.

# నేడు రాజ్‌కోట్‌లో పర్యటించనున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 10:ప్రధానమంత్రి 2026 జనవరి 11న రాజ్‌కోట్‌ను సందర్శిస్తారు. కచ్, సౌరాష్ట్ర ప్రాంతాన్ని దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేసిన వైబ్రెంట్ గుజరాత్ ప్రాంతీయ సమావేశం లో ఆయన పాల్గొంటారు. ఈ సమావేశంలో భాగంగా నిర్వహించే ట్రేడ్ షో ను మధ్యాహ్నం సుమారు 1:30 గంటలకు ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఆ తరువాత, మధ్యాహ్నం దాదాపు 2 గంటలకు రాజ్‌కోట్ లోని మార్వాడీ విశ్వవిద్యాలయంలో కచ్, సౌరాష్ట్ర ప్రాంతాలకు ఉద్దేశించిన వైబ్రెంట్ గుజరాత్ ప్రాంతీయ సమావేశాన్ని ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. 13 గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ గుజరాత్ పారిశ్రామికాభివృద్ధి సంస్థ (జీఐడీసీ) ఎస్టేట్లను అభివృద్ధి చేస్తున్నట్లు ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి ప్రకటించడంతో పాటు, రాజ్‌కోట్‌లోనే జీఐడీసీ వైద్య పరికరాల పార్కును కూడా ప్రారంభిస్తారు.

కచ్, సౌరాష్ట్ర ప్రాంతాల్లోని 12 జిల్లాల అవసరాలను తీర్చడానికి ఉద్దేశించిన వైబ్రెంట్ గుజరాత్ ప్రాంతీయ సమావేశాన్ని 2026 జనవరి 11, 12 తేదీల్లో నిర్వహిస్తున్నారు. పశ్చిమ గుజరాత్‌లో పెట్టుబడికీ, పారిశ్రామిక అభివృద్ధికీ సరికొత్త వేగాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా ఈ ప్రాంతాల కోసమే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సిరమిక్స్, ఇంజినీరింగ్, ఓడరేవులు, ఆధునిక రవాణా వ్యవస్థ, మత్స్యపోషణ, పెట్రోకెమికల్స్, వ్యవసాయం, ఆహార శుద్ధి, ఖనిజాలు, హరిత ఇంధన అనుబంధ విస్తారిత వ్యవస్థ, నైపుణ్యాభివృద్ధి, అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఈలు, పర్యటకం, సంస్కృతి, తదితర రంగాలపై ఈ సమావేశంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటారు. జపాన్, దక్షిణ కొరియా, రువాండా, ఉక్రెయిన్ ఈ సమావేశంలో భాగస్వామ్య దేశాలుగా వ్యవహరిస్తాయి.

విజయవంతమైన వైబ్రెంట్ గుజరాత్ నమూనాను, దీని ప్రభావాన్నీ మరింత విస్తరించడానికి రాష్ట్రమంతటా నాలుగు వైబ్రెంట్ గుజరాత్ ప్రాంతీయ సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు. ఉత్తర గుజరాత్ ప్రాంతానికి సంబంధించిన మొదటి ప్రాంతీయ సమావేశాన్ని 2025 అక్టోబరు 9, 10 తేదీల్లో మెహసానాలో నిర్వహించారు. ఇక కచ్, సౌరాష్ట్ర ప్రాంతాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దక్షిణ గుజరాత్ కోసం ఉద్దేశించిన ప్రాంతీయ సమావేశాన్ని సూరత్ లో (2026 ఏప్రిల్ 9, 10 తేదీల్లో), మధ్య గుజరాత్ కోసం ఉద్దేశించిన ప్రాంతీయ సమావేశాన్ని వడోదర లో (2026 జూన్ 10, 11 తేదీల్లో) నిర్వహిస్తారు.

భారత్‌ను 2047 కల్లా అభివృద్ధి చెందిన భారత్‌గా రూపొందించాలన్న ప్రధానమంత్రి దార్శనికతకు అనుగుణంగా వైబ్రెంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్ సాఫల్యాన్నీ, వారసత్వాన్నీ ఈ ప్రాంతీయ సమావేశాలు ముందుకు నడిపిస్తాయి. ఆయా ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించి విభిన్న రంగాల్లోకి పెట్టుబడులను ఆకట్టుకోవడంతో పాటు ప్రపంచ దేశాలతో అనుబంధాన్ని పెంపొందించాలని కూడా లక్ష్యంగా పెట్టుకున్నాయి.

వైబ్రెంట్ గుజరాత్ వేదికను ప్రాంతాలకు చేరువగా తీసుకుపోయి, వికేంద్రీకృత అభివృద్ధికి తోడ్పడాలని, వ్యాపార నిర్వహణను సులభతరం చేయాలని, నవకల్పన ప్రధానమైన అభివృద్ధిని సాధించాలని, సుస్థిర ఉపాధి అవకాశాల్ని కల్పించాలనే లక్ష్యాలకు ప్రధానమంత్రి ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఇవి ప్రతిబింబిస్తున్నాయి.

ప్రాంతీయ విజయాలను చాటిచెప్పేందుకూ, కొత్త కార్యక్రమాలను ప్రకటించేందుకూ ఓ వేదికగా ఈ ప్రాంతీయ సమావేశాలు ఉపయోగపడతాయి,. ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలకు సాధికారితను కల్పించడం, నవకల్పనను ప్రోత్సహించడం, రాష్ట్రంలో ప్రతి ప్రాంతంలో వ్యూహాత్మక పెట్టుబడికి మార్గాన్ని సుగమం చేసి గుజరాత్ అభివృద్ధిని సాకారం చేసేందుకు కూడా ఈ సమావేశాలు తోడ్పడతాయి. ఈ ప్రాంతీయ సమావేశాల్లో సాధించిన విజయాలను 2027 జనవరిలో నిర్వహించనున్న వైబ్రెంట్ గుజరాత్ ప్రపంచ శిఖరాగ్ర సదస్సులో వివరిస్తారు.

# ప్రధాన రహదారి కాల్వ పనుల పరిశీలన

శ్రీకాకుళం, జనవరి 10: శ్రీకాకుళం మండలం రాగోలు పంచాయతీ ప్రధాన రహదారిలో జరుగుతున్న కాలువ పనులు ఎమ్మెల్యే శంకర్ ఇవాళ స్వయంగా పరిశీలించారు. భవిష్యత్తులో రాగోలు పంచాయితీ మురుగునీరు ప్రవహించేందుకు ప్రధాన కాలువ సక్రమంగా నిర్మించేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాలువ లైన్ అలైన్ మెంట్ చూసుకొని సక్రమంగా కాలువ నిర్మాణ పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రాగోలు గ్రామపంచాయతీ తెదేపా సీనియర్ నాయకులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# శుద్ధజల కేంద్రం ప్రారంభం

## -ప్రజల ఆరోగ్య రక్షణలో పారిశ్రామిక సంస్థల పాత్ర అభినందనీయం

## -ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి


అమరావతి, జనవరి 10: గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణకు శుద్ధమైన తాగునీరు ఎంతో అవసరమని, ఈ దిశగా పారిశ్రామిక సంస్థలు సామాజిక బాధ్యతతో ముందుకు రావడం శుభపరిణామమని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. ఏర్పేడు మండలం కందాడ పంచాయతీ పరిధిలోని కుక్కలవారి కండ్రిగ గ్రామంలో విష్ణు బేరియం ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆర్థిక సహకారంతో నిర్మించిన శుద్ధ జల కేంద్రాన్ని (మినరల్ వాటర్ ప్లాంట్) ఈ రోజు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఏర్పేడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు అధ్యక్షతన జరిగింది.



ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనం సాగించాలంటే కలుషితం లేని నీరు తాగడం ఆవశ్యకమని అన్నారు. గ్రామస్తుల తాగునీటి కష్టాలను గుర్తించి విష్ణు బేరియం సంస్థ తమవంతు సాయంగా శుద్ధ జల కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇతర సంస్థలు కూడా ఇటువంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామస్తులు ఈ పథకం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పేరం ధనంజయులు నాయుడు, కందటి శివశంకర్ రెడ్డి, సూరినాయుడు, మోహన్ నాయరాయ, మండల తెలుగు యువత అధ్యక్షుడు పూల హేమాక్షి రాయల్, బాబు నాయుడు, కేశినేని సుబ్రహ్మణ్యం, రవినాయుడు, సీతావతి ఆచారి, క్రిష్ణప్ప మొదలియర్, రాఘవేంద్ర, రాచేటి సుబ్రహ్మణ్యం, గుణాయాదవ్, కేకే రమణ, చిరంజీవులు నాయుడు, ఆర్ఎంపీ మునెయ్య, భూపతేజ, మునెయ్య, బాలాజీ, బాబునాయుడు, ఏర్పేడు మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# రాత్రి పూట ఈ సమయంలోనే హార్ట్ ఎటాక్ ఎక్కువగా వస్తుంది.. ఎందుకంటే..?



హైదరాబాద్ జనవరి 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అధిక శాతం మరణాలకు కారణమవుతున్న వ్యాధుల్లో గుండె జబ్బులు కూడా ఒకటి. ప్రపంచంలో అధిక శాతం దేశాల్లో గుండె జబ్బుల కారణంగా చాలా మంది ప్రతి ఏటా మృతి చెందుతున్నారు. గుండె జబ్బులు వచ్చేందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. కొలెస్ట్రాల్ స్థాయిలు అధికంగా ఉండడం, పొగ తాగడం, మద్యం సేవించడం, ఒత్తిడి, ఆందోళన అధికంగా ఉండడం, రాత్రి పూట ఆలస్యంగా భోజనం చేయడం, ఆలస్యంగా నిద్రించడం వంటి అనేక కారణాల వల్ల గుండె జబ్బులు వస్తున్నాయి. ఒకప్పుడు కేవలం వయస్సు మీద పడిన వారికి మాత్రమే గుండె జబ్బులు అధికంగా వచ్చేవి. కానీ ప్రస్తుతం యుక్త వయస్సులో ఉన్నవారు కూడా ఈ జబ్బుల బారిన పడుతున్నారు. అయితే గుండె జబ్బులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు గుండె ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వైద్యులు చెబుతున్నారు.

### ఈ సమయంలోనే హార్ట్ ఎటాక్‌లు..

ప్రపంచ వ్యాప్తంగా అధిక శాతం వరకు గుండె జబ్బులు ఒత్తిడి, ఆందోళన లేదా పొగ తాగడం, మద్యం సేవించడం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్ల వల్లే వస్తున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. ఇక గుండె జబ్బుల్లో అనేక రకాలు ఉంటాయి. వాటిల్లో అధికంగా వస్తుంది మాత్రం హార్ట్ ఎటాక్ అని చెప్పవచ్చు. ఈ క్రమంలోనే హార్ట్ ఎటాక్‌లు ఎక్కువగా రాత్రి పూట సంభవిస్తున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. రాత్రి 2 నుంచి తెల్లవారుజామున 6 గంటల లోపు హార్ట్ ఎటాక్‌లు ఎక్కువగా వస్తున్నాయని అంటున్నారు. అయితే ఎక్కువ శాతం మందికి ఈ సమయంలోనే ఎందుకు ఇలా జరుగుతుంది..? అనే విషయాన్ని కూడా పరిశోధకులు అధ్యయనం చేసి మరీ చెబుతున్నారు. సాధారణంగా రాత్రి 2 గంటలు దాటిన తరువాత కొందరికి నిద్రలో ఆక్సిజన్ సరఫరాకు ఆటంకం ఏర్పడుతుంది. అలాగే రక్త సరఫరా కూడా సరిగ్గా జరగదు. దీంతో గుండెపై భారం పడుతుంది. ఫలితంగా హార్ట్ ఎటాక్ సంభవిస్తుంది. ఎక్కువ శాతం హార్ట్ ఎటాక్‌లు వచ్చేందుకు ఇదే కారణమని పరిశోధకులు చెబుతున్నారు.

### రాత్రి పూట ఈ లక్షణాలు కనిపిస్తే..

అయితే హార్ట్ ఎటాక్ ముప్పును ముందుగానే పసిగట్టవచ్చని వైద్యులు చెబుతున్నారు. రాత్రి పూట ఎవరికైనా అనుకోకుండా ఎలాంటి జలుబు లేకపోయినా దగ్గు వస్తుందంటే అప్రమత్తం అవ్వాల్సి ఉంటుంది. అలాగే ఛాతిలో అసౌకర్యంగా ఉంటుంది. కొందరికి ఛాతిపై బరువు పెట్టినట్లు అనిపిస్తుంది. దీన్ని రాబోయే హార్ట్ ఎటాక్ కు సూచనగా భావించాలి. అలాగే రాత్రి పూట నిద్రించినప్పుడు శ్వాస తీసుకోవడం కష్టంగా అనిపించినా, ఒళ్లంతా విపరీతంగా చెమటలు పడుతున్నా, తల తిరగడం, వాంతికి వచ్చినట్లు ఉండడం వంటి లక్షణాలు కనిపించినా అప్రమత్తం అవ్వాల్సి ఉంటుంది. అలాగే హార్ట్ ఎటాక్ సంభవించడానికి ఒకటి లేదా రెండు రోజుల ముందు కొందరికి కంటి రెప్పలపై కురుపులు కూడా వస్తాయి. కొందరికి పాదాలు, చేతులు వాపులకు గురై కనిపిస్తాయి. వీటన్నింటినీ హార్ట్ ఎటాక్‌కు సూచనలుగా భావించాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

### జాగ్రత్తలు తప్పనిసరి..

హార్ట్ ఎటాక్ వచ్చాక బాధపడడం కన్నా రాకుండా ముందుగానే కొన్ని జాగ్రత్తలను తీసుకుంటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. రోజూ 30 నిమిషాల పాటు తేలికపాటి వాకింగ్ చేస్తుండాలి. ఆహారంలో ఉప్పు వాడకాన్ని గణనీయంగా తగ్గించాలి. వారంలో కనీసం 5 రకాల పండ్లను తినాలి. పొగ తాగడం, మద్యం సేవించడం వంటి అలవాట్లను మానేయాలి. రాత్రి పూట త్వరగా భోజనం చేసి త్వరగా నిద్రించాలి. అతిగా ఆహారం తినకూడదు. కొవ్వు పదార్థాలు, నూనె ఆహారాలు, జంక్ ఫుడ్‌ను అధికంగా తినడం తగ్గించాలి. రోజూ పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలి. తాజా కూరగాయలను తినాలి. ఒత్తిడి, ఆందోళనను తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. దీని వల్ల చాలా వరకు హార్ట్ ఎటాక్ ముప్పు తగ్గుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఎక్కువ రోజుల పాటు ఆరోగ్యంగా జీవిస్తారు.

# ఫిలిప్పీన్స్‌లో విరిగిపడ్డ కొండ చరియలు.. నలుగురు మృతి.. పలువురు గల్లంతు

న్యూఢిల్లీ, జనవరి 10:సెంట్రల్ ఫిలిప్పీన్స్ లో కొండ చరియలు విరిగిపడటంతో నలుగురు మృతి చెందగా, 36 మందికి పైగా శిథిలాల కింద చిక్కుకుపోయారు. ఈ ఘటన గురువారం సాయంత్రం, సెబూ నగర సరిహద్దులోని ఒక పర్వత ప్రాంతంలోని ప్రైవేటు వ్యర్థ నిర్వహణ కేంద్రం వద్ద జరిగింది. కొండ ప్రాంతం నుంచి ఒక్కసారిగా కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో దిగువన ఉన్న ఆ గ్యార్బేజ్ లోని వారు, ఇతరులు చిక్కుకున్నారు.

ఈ ఘటనలో నలుగురు మరణించగా, 36 మందికి పైగా శిథిలాల కింద చిక్కుకున్నట్లు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న రక్షణ దళాలు సహాయక చర్యలు ప్రారంభించాయి. దాదాపు రెండు రోజులుగా శిథిలాల తొలగింపు కొనసాగుతోంది. శిథిలాల కింద కొందరు జీవించే ఉన్నట్లు గుర్తించామని, సహాయం కోసం వారి అరుపులు వినిపిస్తున్నాయని అధికారులు తెలిపారు. వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ ప్రమాదానికి గురైన వారిలో అక్కడి కార్మికులే ఎక్కువగా ఉన్నారు. ఈ సహాయ కార్యక్రమాల్లో దాదాపు 300 మంది సిబ్బంది పాల్గొంటున్నారు. శిథిలాల్ని వేగంగా తొలగించేందుకు ప్రయత్నిస్తున్నామని అధికారులు అంటున్నారు.

ఈ ఘటనకు గల కారణాల్ని అణ్వేషిస్తున్నామని తెలిపారు. కొంతకాలం క్రితం ఈ ప్రాంతంలో భూకంపం సంభవించిందని, దీని కారణంగా అక్కడి భూమి, కొండ చరియల్లో స్థిరత్వం పోవడం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

# జనవరి 12న అహ్మదాబాద్‌లో జర్మనీ చాన్సలర్ మెర్జ్‌ను కలుసుకోనున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 10:జర్మనీ ఫెడరల్ చాన్సలర్ శ్రీ ఫ్రెడ్‌రిచ్ మెర్జ్‌తో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జనవరి 12న అహ్మదాబాద్‌లో భేటీ కానున్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆహ్వానించడంతో, జర్మనీ ఫెడరల్ చాన్సలర్ శ్రీ ఫ్రెడరిక్ మెర్జ్ 2026 జనవరి 12, 13 తేదీల్లో భారత్‌లో అధికారిక పర్యటనకు వస్తున్నారు. చాన్సలర్ శ్రీ మెర్జ్ భారత్‌లో అధికారికంగా పర్యటించడం ఇది మొదటి సారి.

జనవరి 12న ఉదయం సుమారు 9:30 గంటలకు నేతలు ఇద్దరూ సబర్మతి ఆశ్రమాన్ని సందర్శిస్తారు. దాదాపు 10 గంటలకు సబర్మతి నది ఒడ్డున అంతర్జాతీయ గాలిపటాల ఉత్సవంలో పాల్గొంటారు. తరువాత, ఉదయం 11:15 గంటల నుంచీ గాంధీనగర్‌లోని మహాత్మా మందిరంలో ద్వైపాక్షిక చర్చలు ఉంటాయి.

నేతలు ఇద్దరూ భారత్ -జర్మనీ వ్యూహాత్మక భాగస్వామ్యంలో పురోగతిని సమీక్షిస్తారు. భారత్ -జర్మనీ వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఇటీవలే 25 సంవత్సరాలు పూర్తి అయ్యాయి. వారి చర్చల్లో వ్యాపారం, పెట్టుబడి, సాంకేతికత, విద్య, నైపుణ్య శిక్షణ, గమనశీలత రంగాల్లో సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవడంపై దృష్టి సారిస్తారు. రక్షణ, భద్రత, శాస్త్ర విజ్ఞానం, నవకల్పన, పరిశోధన, హరిత ప్రధానమైన, సుస్థిర అభివృద్ధి, రెండు దేశాల ప్రజల మధ్య పరస్పర సంబంధాలు వంటి ముఖ్య రంగాల్లో ఇప్పుడున్న సహకారాన్ని మరింత ముందుకు తీసుకుపోవడం గురించి కూడా సమీక్షిస్తారు.

ప్రాంతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం కలిగిన అంశాలపై ప్రధానమంత్రి శ్రీ మోదీ, చాన్సలర్ శ్రీ మెర్జ్ తమ అభిప్రాయాలను తెలియజేసుకొంటారు. వారు ఇరు దేశాలకు చెందిన వాణిజ్య, పరిశ్రమ రంగాల ప్రముఖులతో కూడా చర్చిస్తారు.

# గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి

## వీబీ జీ రామ్ జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి

## -పేదల కడుపు నింపే ఇలాంటి పథకం ప్రపంచంలో ఎక్కడా లేదు

## -మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలి

## -భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

భూపాలపల్లి, జనవరి 10: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి, వీబీ జీ రామ్ జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జీఎస్ఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఉపాధిని దెబ్బతీయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. పేదల కడుపు నింపే లక్ష్యంతో అమల్లోకి తెచ్చిన ఇలాంటి పథకం ప్రపంచంలో ఏ దేశంలో లేదన్నారు. గాంధీ పేరును తొలగించి ఆయన ప్రతిష్ఠను తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాలకు ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలు రాబోయే రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేని యెడల పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఎమ్మెల్యే హెచ్చరించారు.

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తాను చాటేలా, ప్రతీ ఒక్క కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ రెండేళ్ల కాలంలో భూపాలపల్లి మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయాలని సూచించారు.

ప్రజల అవసరాలను గుర్తించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే మన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. గత పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం, తాగునీరు, రహదారులు వంటి అంశాల్లో సాధించిన పురోగతిని ప్రజలకు వివరించాలన్నారు.

నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ముందుకువెళ్లాలని సూచించారు. క్రమశిక్షణ, ఐక్యతతో ముందుకెళ్తే మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడం ఖాయం : కేటీఆర్



హైదరాబాద్, జనవరి 10: రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడం ఖాయమని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. మున్సిపల్ ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేసే కార్యక్రమంలో భాగంగా శనివారం హైదరాబాద్‌లో నిజామాబాద్, ఖమ్మం జిల్లా నేతలతో కేటీఆర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల నేతల సమావేశంలో పార్టీ నేతలకు పురపాలక ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాల పైన కేటీఆర్ దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రెండు సంవత్సరాలుగా పట్టణాలను సంక్షోభం నెట్టిన కాంగ్రెస్ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతుందన్నారు. రానున్న పురపాలక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి గట్టిగా బుద్ధి చెబుతారని.. పట్టణ ప్రాంతాల ప్రజలు కూడా కాంగ్రెస్ పార్టీ పైన తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారని కేటీఆర్ అన్నారు. రెండు సంవత్సరాలుగా ఒక్క రూపాయి కూడా ఏ పట్టణానికి చెల్లించని ఏకైక ప్రభుత్వంగా చరిత్రలో కాంగ్రెస్ ప్రభుత్వం నిలిచిపోతుందన్నారు.

కాంగ్రెస్ రెండు సంవత్సరాల పాలనలో పట్టణాల్లో పరిపాలన పూర్తిగా పడకేసిందని?పారిశుద్ధ్య నుంచి మొదలుకొని ప్రతి అంశంలో పట్టణ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. గత ప్రభుత్వం కేటాయించిన అభివృద్ధి కార్యక్రమాలకు మరోసారి శిలాఫలకాలు వేయడం తప్పించిఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పని ఒకటి లేదని కేటీఆర్ అన్నారు.

గత ప్రభుత్వం ప్రారంభించిన అనేక మౌలిక వసతుల ప్రాజెక్టులు, రోడ్లు, కమ్యూనిటీ హాల్, మోడల్ మార్కెట్ల వంటి ప్రతి ఒక్క కార్యక్రమానికి నిధులు ఆపివేయడంతో అన్ని కార్యక్రమాలు అర్థాంతరంగా ఆగిపోయాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను వ్యవసాయనం గాని సంక్షోభంలోకి నెడుతూ.. మరోవైపు పట్టణాలను పడుకోబెట్టి ఏ ముఖం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడుగుతుందన్నారు. ఈ రెండు సంవత్సరాల్లో ఆయా పట్టణాలకు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను? ఇచ్చిన నిధులను వివరించి ఓట్లు అడగాలని కాంగ్రెస్ పార్టీ నేతలకు కేటీఆర్ సవాలు చేశారు.

మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి పార్టీ తరఫున చేసుకోవాల్సిన ఏర్పాట్లను ప్రజల ముందు ఉంచాల్సిన వివిధ అంశాలను కేటీఆర్ ఈ సందర్భంగా పార్టీ నేతలకు తెలియజేశారు. రెండు జిల్లాలకు సంబంధించిన ప్రతి మున్సిపాలిటీలోని క్షేత్రస్థాయి పరిస్థితులపై క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్ ఎన్నికల్లో అధికార పార్టీ అరాచకాలను, అధికార దుర్వినియోగాన్ని తట్టుకొని మంచి ఫలితాలు సాధించామని.. ఇదే స్ఫూర్తితో మున్సిపల్ ఎన్నికల్లోనూ మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు హాజరైన ఈ సమావేశం లో పార్టీ సీనియర్ నేత, శాసనసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు పలు అంశాలపైన నేతలకు దిశా నిర్దేశం చేశారు.

# ప్రవాసీ భారతీయ దివస్ సందర్భంగా ప్రవాస భారతీయులకు ప్రధాని శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, జనవరి 10:ప్రవాసీ భారతీయ దివస్ సందర్భంగా ప్రవాస భారతీయులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు.

భారత దేశానికి, ప్రపంచానికి మధ్య శక్తిమంతమైన వారధిగా ప్రవాస భారతీయులు వ్యవహరిస్తున్నారని ప్రధానమంత్రి అన్నారు. వారిని భారత్‌కు మరింత చేరువ చేసేలా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని స్పష్టం చేశారు. "ప్రవాసీ భారతీయ దివస్ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు. భారతదేశానికి ప్రపంచానికి మధ్య శక్తిమంతమైన వారధిగా విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు వ్యవహరిస్తున్నారు.

# వివేకానందుని వాక్కులే ఏబీవీపీ సంస్థను ఏర్పాటు చేయడంలో కీలక భూమిక

## –ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు

### -ఏబీవీపీ ఆద్వర్యం లో సికింద్రాబాద్ జిల్లా ఆధ్వర్యంలో వివేకానందా జయంతి ఉత్సవాలు



హైదరాబాద్ జనవరి 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); వివేకానంద 163 వ జయంతి ఉత్సవాలలో భాగంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్–సికింద్రాబాద్ జిల్లా, అల్వాల్ శాఖ ఆధ్వర్యంలో నారాయణ జూనియర్ కళాశాలలో సెమినార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది... ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు హాజరై ప్రసంగించారు. వివేకానందుని వాక్కులే ఏబీవీపీ సంస్థను ఏర్పాటు చేయడంలో కీలక భూమిక అని, నేటి విద్యార్థులు మరియు యువత వివేకానందుని స్ఫూర్తిగా తీసుకుని జీవనం సాగించాలని, వివేకానందుని స్ఫూర్తితో మన దేశ అభ్యున్నతికి పాటుపడాలని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి విద్యార్థి తన లక్ష్యాలను సాధించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు, ప్రతి విద్యార్థి భారత్ ను విశ్వ గురువు స్థానంలో నిలిపేలా, 2047వరకు సాధించాలనుకుంటున్న వికాసిత్ భారత్ పాలుపంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ చెర్క బాలకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్, నగర కార్యదర్శి రిషి, సుశాంత్, యశ్వంత్ రెడ్డి, ఏకిందర్,మోహిత్, మనీష్ విద్యార్థులు, ఏబీవీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో చిన్నారులకు అల్మాంట్-కిడ్ సిరప్ వాడవద్దు

### -డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కీలక హెచ్చరిక

హైదరాబాద్ జనవరి 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: గతేడాది అక్టోబర్‌లో మధ్యప్రదేశ్‌లో కోల్డ్–రిఫ్ అనే దగ్గు మందు వల్ల 20 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటన గురించి అందరికీ తెలిసిందే. ఈ ఉదంతం మర్చిపోక ముందే తెలంగాణలో మరో దగ్గు మందు మహమ్మారి ప్రవేశించినట్లు డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ హెచ్చరించింది. రాష్ట్రంలో చిన్నారులకు అల్మాంట్–కిడ్ సిరప్ వాడవద్దని కీలక ఆదేశాలు జారీ చేసింది. అది దగ్గు మందు కాదని.. ఆ రూపంలో ఉన్న స్లో పాయిజన్ అని పేర్కొంది. అందులో ఎథిలీన్ గ్లైకాల్ కలిసినట్లు ల్యాబ్ పరీక్షల్లో తేలింది. దీంతో సిరప్ వినియోగాన్ని వెంటనే నిలిపివేయాలని డిసిఏ అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. ఈ విషయాన్ని కేంద్ర ఔషధ ప్రమాద నియంత్రణ సంస్థ (సిడిఎస్‌సిఓ) ఈస్ట్ జోన్, కోల్‌కతా నుంచి వచ్చిన అలర్ట్ ఆధారంగా రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ శాఖ ప్రకటించింది. బిహార్‌కు చెందిన ట్రిడస్ రెమిడీస్ అనే ఫార్మా సంస్థ తయారు చసిన ఎఎల్–24002 బ్యాచ్ సిరప్ శాంపిల్స్‌ను పరిశీలించగా.. అత్యంత విషపూరితమైన ఎథిలీన్ గ్లైకాల్ ఉన్నట్లు తేలిందని అధికారులు చెప్పారు. ఇది కిడ్నీలు, నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని.. పిల్లలకు ప్రాణాపాయం కలిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ఈ అల్మాంట్–కిడ్ సిరప్‌ను ఎవరైనా కొనుగోలు చేస్తే.. దాని వినియోగాన్ని వెంటనే ఆపాలని సూచించారు. ఏదైనా అత్యవసరమైతే.. నేరుగా డ్రగ్స్ కంట్రోల్ శాఖకు తెలియజేయవచ్చని లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1800–599–6969కు కాల్ చేయాలని సూచించింది. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతీ ఒక్కరు దగ్గు మందుల పట్ల అప్రమత్తంగా ఉండాలని.. అనుమానాస్పద సిరప్ కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని డిసిఏ అధికారులు ప్రజలను కోరారు.

# అంతరాష్ట్ర సైబర్ ప్రధాన నిందితుడు అరెస్ట్

## - ఏఎస్పీ రుత్విక్ సాయిరాజన్న

సిరిసిల్ల, జనవరి 10: అంతరాష్ట్ర సైబర్ ప్రధాన నిందితుడు లక్కీ కుమార్ ఏ సదానంద్ కుమార్ ని అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించినట్లుఏఎస్పీ రుత్విక్ సాయి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ వివరాలు వెల్లడించారు. బీహార్ రాష్ట్రం బహుదూర్పుర్ గ్రామానికి చెందిన లక్కీ కుమార్ గుర్తించడం జరిగిందన్నారు. గతంలో హైదరాబాద్‌లో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వహిస్తూ జీవించగా, వ్యాపారం సరిగా సాగకపోవడంతో బీహార్‌కు తిరిగి వెళ్లాడన్నారు. అనంతరం ఆన్‌లైన్ లోన్ల పేరుతో ప్రజలను మోసం చేయాలని పథకం రూపొందించాడనీ, అందులో భాగంగా నిందితుడు తన సహచరులైన అనిల్ నాయక్, బోడ రజిత మరియు భరత్ రాజ్లతో కలిసి ఫేస్‌బుక్‌లో ఇండియా బుల్స్ ధని ఫైనాన్స్ అనే పేరుతో నకిలీ పేజీని సృష్టించి, తక్కువ వడ్డీ రేట్లతో లోన్లు ఇస్తామని ప్రచారం




చేసాడన్నారు. బాధితుల నుంచి ఆధార్ కార్డు, పాన్ కార్డు తదితర గుర్తింపు పత్రాలు సేకరించి, లోన్ ప్రాసెసింగ్ ఫీజు, ఇతర ఛార్జీల పేరుతో డబ్బులు వసూలు చేసి, అనంతరం లోన్ మంజూరు చేయకుండా మోసం చేసినట్లు గుర్తించామన్నారు. దేశవ్యాప్తంగా ఎన్సీఆర్పీ పోర్టల్ నందు 30 ఫిర్యాదులు ఉన్నవని, గతంలో ముగ్గురు నిందితులను రిమాండ్ కి తరలించడం జరిగిందని వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి ఐపీఎస్ తెలిపారు. ప్రజలు ఆన్‌లైన్ లోన్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్, లింక్స్, ఫేస్‌బుక్ పేజీలను నమ్మి వ్యక్తిగత వివరాలు లేదా డబ్బులు పంపవద్దని పోలీసులు హెచ్చరించారు.

# సంక్రాంతి వేళ దొంగతనాలకు తావు

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి-ఎస్పీ మహేష్ బి గీతే



రాజన్న సిరిసిల్ల, జనవరి 10: నేటినిజం (ప్రతినిధి): సంక్రాంతి వేళ దొంగతనాలకు తావుంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మహేష్ బి గీతే పేర్కొన్నారు. ఎస్పీ జిల్లా ప్రజలకు పలు సూచనలు, సలహాలు చేశారు. గ్రామాల్లో పట్టణాల్లో అనుమానితుల కదలికలపై సమాచారం అందించాలన్నారు- కాలనీల్లో, ఇంటి పరిసరాల్లో స్వీయరక్షణార్థం సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా చాలా మంది సొంత ప్రాంతాలకు, బంధువుల ఇండ్లకి, విహార యాత్రలకు ప్రయాణాలు చేస్తారని, ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తాతన్నారు. ఊళ్లకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విలువైన బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలని, సెలవుల్లో బయటికి వెళుతున్నప్పుడు మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉండే తాళం, సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సర్ను ఏర్పాటు చేసుకోవడం మంచిదన్నారంతాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరి స్థానిక పోలీస్‌స్టేషన్ లో లేదా మీ గ్రామ పోలీస్ అధికారికి సమాచారం ఇవ్వాలన్నారు. మీ వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోవాలని, నమ్మకమైన వ్యక్తులను మాత్రమే వాచ్ మెన్/ సెక్యూరిటీ గార్డ్/ సర్వెంట్ గా నియమించుకోవాలని అన్నే. సోషల్ మీడియాలో మీ లోకేషన్, ట్రావెల్స్ ప్లాన్స్, ఎప్పుడు ఎక్కడికి వెళ్తున్నాం అనే మీ అప్డేట్స్ పెట్టవద్దని సూచించారు.

# వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అవకాశం ఇవ్వండి

## - బీజేపీ ఆధ్వర్యంలో ఎన్నికల సమావేశం



రాజన్న సిరిసిల్ల, జనవరి 10: నేటినిజం (ప్రతినిధి): బిజెపి పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు గోపి మాట్లాడుతూ రాజన్న గుడి దర్శనాలు నిలిపివేసి రెండు నెలలు కావస్తున్న ఎలాంటి డెవలప్మెంట్ లేదని, వేములవాడ ఊరిని డెవలప్మెంట్ పేరుతో ఎక్కడికక్కడ కూల్చివేతలు మాత్రమే చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలగజేస్తున్న ఎమ్మెల్యే గారిని విమర్శించారు. రాజన్న దర్శనం శివరాత్రి లోపు అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు తెలియజేసి వేములవాడ మున్సిపల్ పై కాషాయనీ జెండా ఎగరవేయడం ఖాయమని తెలియజేశారు. జిల్లా ఇన్చార్జ్ గంగాడి మోహన్ రెడ్డి మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికలలో గెలిపే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త విష్ చేయాలని అన్నారు. ప్రతాపరామకృష్ణ మాట్లాడుతూ వేములవాడలో కేవలం బిజెపితో మాత్రమే అభివృద్ధిసాధ్యమని గుర్తు చేస్తూ ఆకాశగంగా పైపులైను వంటి ఎన్నో పనులు ప్రజలకు చేసింది బిజెపి అని గుర్తు చేస్తూ ఈసారి బిజెపికి అవకాశం ఇస్తే వేములవాడను ఇంకా ఎంతో అభివృద్ధి పథంలో తీసుకెళ్తామని ప్రజలకు విన్నవించారు. ఈ కార్యక్రమానికి ముందుగా 1000 సంవత్సరాల క్రితం ఇదే జనవరిలో మొదటి జ్యోతిర్లింగమైన సోమనాథ్ ఆలయం ఎన్నో మార్లు ధ్వనీశంకు గురి చేయగా పూజలు ప్రారంభించడం జరిగిందని, భీమేశ్వరాలయంలో చేశారు.

# భారత్ ను అగ్రదేశాల సరసన నిలబెట్టిన ప్రదాని మోదీ

### హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్ జనవరి 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఒకప్పుడు భారత దేశం అంటే చిన్నచూపు ఉండేదని మోదీ వచ్చాక అగ్రదేశాల సరసన నిలబెట్టారని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీ వార్షికోత్సవంలో పాల్గొని ప్రసంగించారు. నేడు భరత్ అగ్రదేశాల సరసన నిలబడివాటితో అన్ని రంగాల్లో పోటీ పడుతున్నామ న్నారు. డిఫెన్స్ అకాడమీలో చదువుతున్నారు కాబట్టి మీరంతా దేశ రక్షణ కోసం ముందుకు రావాలని కోరారు. దేశంలో రక్షణ రంగంలో ఉన్న వారికి ఎక్కువ గౌరవం ఉంటుంది. మీరంతా దేశభక్తి సంపూర్ణంగా ఉన్నవారు. మనదేశం ప్రపంచంలో అన్నిదేశాల కంటే ఎక్కువ యువత ఉంది. అదే మా సంపద అని గర్వంగా మన ప్రధాని మోదీ చెప్తున్నారు. ఆ యువశక్తి ఆరోగ్యంగా జ్ఞాన వంతంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నారు.

# దుబ్బ రాజన్న జాతర పోస్టర్ ఆవిష్కరించిన ఆలయ ఈవో రమాదేవి



రాజన్న సిరిసిల్ల, జనవరి 10: నేటినిజం (ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం నాగయ్యపల్లి గ్రామంలో వెలసిన గ్రామ దేవత శ్రీ దుబ్బ రాజన్న స్వామి జాతర పోస్టర్‌నువేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈవో రమాదేవి చేతులమీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ నెల 17, 18 తేదీలలో భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్న జాతర సందర్భంగా గ్రామస్తులు మరియు జాతర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈవో రమాదేవి మాట్లాడుతూ, గ్రామ దేవత ఆశీస్సులతో జాతరను సంప్రదాయబద్ధంగా, శాంతి యుతం గా నిర్వహించాలని తెలి పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా అన్ని ఏర్పా ట్లు చే యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, జాతర కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి కరాటే పోటీల బ్రోచర్ ను ఆవిష్కరించిన అల్ఫోర్స్ సంస్థల అధినేత డా వి. నరేందర్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, జనవరి 10: నేటినిజం (ప్రతినిధి): శనివారం కరీంనగర్ ఎస్ ఆర్ ఆర్ కాలేజ్ గ్రౌండ్ లో రాష్ట్రస్థాయి కరాటే పోటీల బ్రోచర్ విడుదల చేశారు.

అల్ఫోర్స్ సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి కరాటే పోటీల బ్రోచర్ను విడుదల చేశారు. . ఈ కార్యక్రమంలో ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఫౌండర్ అబ్దుల్ మన్నన్, కరాటే మాస్టర్లు మానపాటి తిరుపతి, కనికరపు రాజశేఖర్, అబ్దుల్ ఫర్హాన్ అబ్బాని పాల్గొన్నారు. ఫిబ్రవరి 8 తేదీన స్థానిక వేములవాడ పట్టణం శ్రీనివాస్ ఫంక్షన్ హాల్ లో రాష్ట్రస్థాయి కరాటే పోటీలు నిర్వహించడం జరుగుతుందని, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నుండి క్రీడాకారులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

# అట్టహాసంగా పటేల్ క్రికెట్ ప్రీమియర్ లీగ్



రాజన్న సిరిసిల్ల, జనవరి 10: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ పట్టణంలో రాష్ట్ర వ్యాప్త పటేల్ క్రికెట్ 3వ ప్రీమియర్ లీగ్ పోటీలు శనివారం రెండవ రోజుహట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ మున్నూరు కాపు పటేల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్‌హాజరయ్యి క్రికెట్ మ్యాచ్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్నూరు కాపు సామాజిక వర్గాన్ని ఒక్క తాటిపైకి చేర్చుట కోసం ప్రతి సంవత్సరం క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నాం అని తెలిపారు. దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా 50 టీంలు నమోదు చేసుకున్నారని తెలిపారు. కావున యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గెలుపొందిన విజేతలకు మూడవ రోజున బహుమతి ప్రదానం అందిస్తున్నట్లు తెలిపారు. మున్నూరు కాపు పటేల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్నూరు కాపు సోదరులను ఒక్కతాటి పైకి తేవడానికి వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని, పటేల్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ లు నిర్వహించడం వల్ల యువతలో చైతన్యం వస్తుందని తెలిపారు. గెలుపొందిన జట్లకు ప్రథమ,ద్వితీయ బహుమతులను పలువురు ముఖ్య అతిథులు అందజేయనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక ప్రెసిడెంట్ పొలాస నరేందర్, పోస్నెట్టి శంకర్ జిల్లా మున్నూరు కాపు ప్రధాన కార్యదర్శి, డాక్టర్ బండారి రాజ్ కుమార్ మెడికల్ అసోసియేషన్ నాయకులు, ఇప్పపూల అజయ్ మాజీ కౌన్సిలర్ , కొండ కనకయ్య మారం కుమార్ మాజీ కౌన్సిలర్ మున్నూరు కాపు సత్రం డైరెక్టర్ కూరగాయల మల్లేశం,తడగొండ మాజీ సర్పంచ్ చందం రమేష్, సంపత్ కుమార్,మడ్లపెల్లి శ్రీనివాస్,మున్నూరు కాపు జర్నలిస్ట్ ఫోరం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు వేల్పుల శ్రీనివాస్, రాచమల్ల సుగునాకర్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు వంగల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి క్రికెట్ పోటీలు

## – సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్ చే ప్రారంభం



వేములవాడ, జనవరి 10:వేములవాడ కోర్టులో విధులు నిర్వహిస్తున్న న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కోర్టు కానిస్టేబుల్ లకు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు గుడిసె సదానందం ఆదేశానుసారం సాంస్కృతిక క్రీడల కార్యదర్శి గుజ్జే మనోహర్ నేతృత్వంలో శనివారం క్రికెట్ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ క్రికెట్ పోటీలను వేములవాడ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్ టాస్ వేసి క్రీడలను ప్రారంభించారు. ఈ క్రీడల్లో కోర్టు సిబ్బంది కోర్టు కానిస్టేబులు ఒక జట్టుగా, న్యాయవాదులు ఒక జట్టుగా ఏర్పడి క్రికెట్ ఆడారు. ఎంతో రసవత్తరంగా సాగిన క్రికెట్ ఆటను సీనియర్ సివిల్ జడ్జి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు వీక్షించారు. క్రీడాకారులకు సీనియర్ సివిల్ జడ్జి టీషర్టులను అందించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమల గౌడ్, విద్యాసాగర్ రావు, శ్రీనివాస్, జనార్ధన్, క్రాంతి కుమార్, సుధాకర్ రెడ్డి, పొత్తూరి అనిల్ కుమార్, దివాకర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం..

## -ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

నేటి నిజం రాజన్న సిరిసిల్ల ప్రతినిధి పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.. వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేములవాడ పట్టణ పరిధిలోని అర్హులైన 40 మంది లబ్ధిదారులకు 14 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిది చెక్కులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అందులో భాగంగా మహిళ ప్రజలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 సిలిండర్, రుణమాఫీ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. మన ప్రాంతంలో వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స తీసుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వార, ఎల్‌ఓసి ల ద్వారా ఇప్పటి వరకు 20 కొట్లు పై చిలుకు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.. పేదలకు వైద్య పరంగా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు..గత ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 10 సంవత్సరాలలో 400 కోట్లు పంపిణీ చేస్తే ప్రజా ప్రభుత్వ ఏర్పడిన నాటినుండి నేటి వరకు 800 కోట్ల మేర లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ కనకరపు రాకేష్, కాంగ్రెస్ నాయకులు సాగరం వెంకటస్వామి, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, చిలుక రమేష్, పుల్కం రాజు, అంబటి చందు, లహరి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**

RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com